క్లుప్తంగా

భక్తుల సందర్శనార్థం సత్యదేవుని ఊరేగింపు వాహనాలు



భక్తులు దర్శించేలా ఏర్పాటు చేసిన స్వామివారి ఊరేగింపు వాహనాలు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామి వారిని ఉత్సవాల్లో ఊరేగించే ఆంజనేయ, గరుడ, గజ వాహనాలు, వెండి పల్లకీని ఈఓ కార్యాలయం వద్ద భక్తుల సందర్శనార్థం ఉంచారు. ఈ మేరకు ఇక్కడ వాహనశాల పేరుతో షెడ్డు నిర్మించి దానికి అద్దాలు ఏర్పాటు చేశారు. అద్దాల నుంచి భక్తులు ఈ వాహనాలను తిలకిస్తున్నారు. గతంలో ఈ వాహనాలను వ్రతమండపాలకు ఎదురుగా గల గొడౌన్‌లో ఉంచేవారు. అక్కడ అవి ఒక మూలగా ఉండడంతో ఎవరికీ కనిపించేవి కాదు. ప్రస్తుతం అందరూ దర్శించేలా ఏర్పాటు చేశారు.

గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ఏలేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని గర్భిణులు, బాలింతలకు సోమవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక 10, 12 వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, కోరాడప్రసాద్ పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



పెద్దిపాలెంలో వర్షాలకు దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని రాష్ట్ర ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, ఏపీ ఎంఐపీ అధికారి డి.రమేష్ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను స్థానిక అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, మండల అధికారులు శ్రీవల్లి, అరుణ్‌కుమార్, వెన్నెల, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి రాంగోపాల్

గోకవరం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ రాంగోపాల్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి మూడు అర్జీలు రాగా వాటిని పరిశీలించి ఆయాశాఖల అధికారులకు బదలాయించారు. అనంతరం గోకవరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కేఎస్ఎస్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: సారా బట్టీలపై దాడి చేసి పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లిశాల గ్రామ శివారు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సోమవారం రాత్రి ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సారా తయారీకి ఉపయోగించే 100 లీటర్ల బెల్లపు ఊటను, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడుతున్న గ్రామానికి చెందిన జుత్తుక రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో సీఐ బి.సూర్య అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు సమస్యకు చెక్

- జోరుగా కాలవల్లో పూడిక తీత పనులు
- 10 కిలోమీటర్లకు రూ.46 లక్షలు మంజూరు
- తీరనున్న దీర్ఘకాలిక సమస్య



తుని ప్రధాన డ్రైన్‌లో పూడిక తీసిన దృశ్యం



తుని-ఎస్.అన్నవరం రోడ్డులో పూడిక తీస్తున్న కార్మికులు

తుని: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఏటా పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రధాన కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు ముందుకు పారడం లేదు. మున్సిపాలిటీలో పాలకపగ్గాలు చేపట్టిన అధికార పార్టీ అన్ని విషయాల్లోనూ జాగ్రత్తలను తీసుకుంటోంది. ఇందుకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి వివరాలను సేకరించి దిశా నిర్దేశం చేస్తున్నారు. గతంలో పాలకవర్గం లేకపోవడంతో వర్షాకాలంలో పలు ప్రాంతాలు నీట మునిగేవి. వర్షం వస్తే రోడ్లు చెరువులను తలపించేవి. సమస్యను గమనించిన మంత్రి దాడిశెట్టి రాజా ప్రస్తుత వేసవిలో డ్రైన్లు, కాలువలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు కాలవల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు.

ఇదీ పరిస్థితి..

పట్టణంలోని మేజరు కాలువలు 7 కిలోమీటర్లు, మీడియం, మైనర్ కాలవలు 9 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. 10 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడిక తీయడానికి ఇంజినీరింగ్ శాఖ తయారు చేసిన అంచనాల ప్రకారం రూ.46 లక్షలు మంజూరు చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. తక్కువ వ్యవధిలో మొత్తం పనిని పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు వచ్చినా పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నది పాలకవర్గం ఉద్దేశం. ఇందుకు అనుగుణంగానే పనులు వేగంగా చేస్తున్నారు.

పూడిక తీసే కాలువలు

జాతీయ రహదారిని అనుకుని కొండవారిపేట రైల్వే అండర్ పాస్ వరకూ, సినిమారోడ్డు నుంచి పాతబజారువీధి వేంకటేశ్వరస్వామి గుడి వరకూ ఎక్కువ దూరం ఉంది. ఇవి ప్రధాన కాలువలు కావడం విశేషం. పట్టణంలో వచ్చే 75 శాతం నీరు వీటి ద్వారా వెళుతుంది. వీటితో పాటు సీతారాంపురం, అమ్మాజీపేట, సూరవరం రోడ్డు, మార్కండ్రాజుపేట కాలువలు ఉన్నాయి. ఈ నెలాఖరు నాటికి పూడికతీత పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, కమిషనర్ ప్రసాదరాజు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు.

పూడికతీతపై ప్రత్యేక దృష్టి



గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వస్తే చాలు చాలా ప్రాంతాలు నీటి మునిగేవి. ఇందుకు ప్రధాన కారణం సకాలంలో పూడిక తీత పనులు చేపట్టక పోవడం. మేము అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే పూడిక తీతపై దృష్టి సారించాం. సత్వరమే నిధులు మంజూరు చేశాం. మంత్రి దాడిశెట్టి రాజా సూచనల మేరకు ప్రధాన కాలవల్లో పూడిక తీత పనులు త్వరలోనే పూర్తి చేస్తాం.

– ఏలూరి సుధారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్, తుని

నిత్యం పర్యవేక్షణ



పట్టణంలో రూ.46 లక్షలతో పూడిక తీత పనులు చేపట్టాం. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. పనుల పర్యవేక్షణ బాధ్యతను డీఈఈ ప్రకాశరావుకు అప్పగించాం. కాలువల్లో తీసిన పూడికను ఆరిన వెంటనే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాం. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాం.

– టీజేఎస్, ప్రసాదరాజు, కమిషనర్, తుని

జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి



ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి రాజాకు వినతిపత్రం సమర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

తుని: దళితుల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని రాష్ట్ర, రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. సోమవారం సాయంత్రం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో తుని పట్టణం కొండవారిపేట, వీరవరపుపేట, ఇసకలపేట, రామకృష్ణాకాలనీ, ఎస్.అన్నవరం తదితర ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల నాయకులు మంత్రి రాజాను కలిసి వినతిపత్రం సమర్పించారు. తుని గొల్ల అప్పారావు సెంటర్లో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కాకాడ శ్యామ్‌కుమార్ కోరారు. ఇందుకు మంత్రి రాజా సానుకూలంగా స్పందిస్తూ విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. దళిత సంఘాల నాయకులు చీలి ప్రసన్న, తుమ్మలపల్లి కుమార్, జ్యోతిబాబు, వంశీ, సత్తిబాబు,నాగేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తుని వైఎస్సార్ కాలనీలో మహిళ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏలూరి బాలు

తుని: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. స్థానిక 22వ వార్డు వైఎస్సార్ కాలనీలో సోమవారం సాయంత్రం కౌన్సిలర్ కోలా శ్రీను ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ– మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీరు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ ప్రసాదరాజుకు సూచించారు. వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టెంట్ టోల్ గేట్స్ ఎత్తివేయాలని వినతి



ప్రత్తిపాడులో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

ప్రత్తిపాడు: టెంట్ టోల్ గేట్స్‌ను ప్రభుత్వం ఎత్తివేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు మాట్లాడుతూ ప్రజలు గృహ నిర్మాణానికి, ఇతర అవసరాల కోసం ఉపయోగించే మట్టి, ఇసుక, ఇటుకలను తరలించే వాహనాల నుంచి అన్యాయంగా అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ లీజు దారులు ప్రభుత్వానికి ట్యాక్స్ కడుతున్నప్పటికీ సరకులు తరలించే వాహనాల నుంచి సొమ్ములు వసూలు చేయడం దారుణమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం టెంట్ గోల్ గేట్స్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, గున్నాబత్తుల రాజబాబు, మదినే బాబ్జి, పార్టీ విస్తారక్ ఈగల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈనాం భూముల సాగుదారుల ఆందోళన



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈనాం భూముల సాగుదారులు

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరులో ఈనాం భూముల సాగుదారులకు నోటీసుల్చి, సర్వే జరపాలని డిమాండ్ చేస్తూ ఈనాం భూముల సాగుదారులు సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన చేశారు. సాగుదారుల కమిటీ అధ్యక్షుడు తాడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సాగుదారులు ప్రత్తిపాడులో భారీ ర్యాలీ చేసి తహసీల్దార్ కార్యాయలం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ ఈనాం భూములకు పట్టాలు లేకపోవడంతో ఏ పథకం కూడా సాగుదారులకు వర్తించడం లేదన్నారు. బ్యాంకుల్లో సైతం రుణాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు నాలుగేళ్ల క్రితమే సాగుదారులు డిక్లరేషన్లు ఇచ్చారని చెప్పారు. చింతలూరు భూములను ప్రభుత్వం ఈనాం భూములుగా ప్రకటించినందున సాగుదారులందరికీ నోటీసులిచ్చిన తర్వాతే సమగ్ర భూ సర్వే చేపట్టాలని ఏగుపాటి అర్జునరావు, మానుకొండ లచ్చబాబు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు రాజాల రత్నం, దుమ్ముల సింహాచలం, ఆరుగుళ్ల అప్పారావు, కాదా సత్యవతి, తూము చెల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పటిష్ట భద్రతకు చర్యలు



మల్లేపల్లి రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి, తదితరులు

గండేపల్లి: హైవేపై పటిష్టమైన భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి తెలిపారు. గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జాతీయ రహదారిలో ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. హైవేపై బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించామని, అక్కడ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, చోరీలను అరికట్టేందుకు రాత్రివేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేస్తామన్నారు. పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకున్నందుకు గాను సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై వై.గణేష్ కుమార్‌ను ఆమె అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రౌతులపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం



రౌతులపూడిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. రౌతులపూడిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి స్థానిక హైస్కూల్ రోడ్డు, సినిమా సెంటర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. హైస్కూల్ రోడ్డు వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత మహిళలు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు. ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసిందన్నారు. నాడు–నేడులో భాగంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. తొలుత డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.17 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జునమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీఓ సూర్యారావు

తుని: క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆలోచన సరళి, నైపుణ్యత పెంపొందుతాయని ఉమ్మడి విశాఖ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో 14 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు సోమవారంతో ముగిసింది. ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆశక్తి కనబరచాలన్నారు. సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులను ఆటపాటల్లో ప్రోత్సహించడం ద్వారా తల్లిదండ్రులు వారికి మరింత చేరువ కావచ్చన్నారు. ఈ వేసవి శిబిరంలో విద్యార్థులకు వాలీబాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఖోఖో, టేబుల్ టెన్నీస్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, స్కేటింగ్, డ్యాన్స్, యోగా, స్పోకెన్ ఇంగ్లిషు తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్, అంజి, సురేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం.. విజ్ఞానానికి మూలం



శంఖవరం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



వీరవరంలో వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు



తుని గ్రంథాలయంలో వేసవి శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం
- విద్యార్థులు పలు అంశాలపై శిక్షణ

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కోరాడప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత జాతీయ నాయకులు మహత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని గ్రంథాలయాధికారి సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయుడు తూము రౌతు శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, వీరవరం, గెద్దానాపల్లి శాఖా గ్రంథాలయాల్లో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. వీరవరంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వెలుగులు భాస్కరరావు సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆయా గ్రంథాలయాల్లో విద్యార్థులకు మరింత జ్ఞానాన్ని అందించే జనరల్ నా లెడ్జ్, కాంపిటేటివ్, చరిత్ర, ఆధ్యాత్మిక గ్రంథాలు తదితర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. కురుమళ్ల విష్ణు, వి.వెంకటేశ్వరావు, మరిడిబాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: పుస్తక పఠనంతోనే విద్యార్థులకు జ్ఞానం కలుగుతుందని గ్రంథాలయాధికారి చవల ప్రియాంక అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బొండా జగదీష్, పడాల సతీష్, పుణ్యమంతులు చినబాబు, పొట్నూరి నాగేశ్వరరావు, దాసరి శ్రీను పాల్గొన్నారు.

తుని: వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఉపాధ్యాయుడు కె. నాగభూషణం అన్నారు. స్థానిక శాంతినగర్ గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జూన్ 11 వరకు నిర్వహించే ఈ తరగతుల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామని లైబ్రేరియన్ రంగానాథ్ తెలిపారు. తుని పట్టణానికి చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

జగ్గంపేట: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినిని సోమవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని రాజపూడి హైస్కూల్ విద్యార్థిని నంగన అక్షయ పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను సోమవారం స్థానిక విశ్రాంతి ఉద్యోగ భవనంలో ఘనంగా సన్మానించారు. జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, కొత్త కొండబాబు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువులో పూడికతీత పనులు ప్రారంభం



వరకట్టు చెరువులో పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: చెరువుల్లో నీటి నిల్వలు పెంచేందుకు పూడిక తీత పనులను ప్రభుత్వం చేపట్టిందని డి.పోలవరం వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ అన్నారు. సోమవారం గ్రామానికి చెందిన వరకట్టు గడ్డ చెరువులో పూడిక తీత పనులను పార్టీ నాయకుడు చిటికెల వరహాల బాబుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఉపాధి కూలీలు వేసవిలో ఇతర గ్రామాలకు వలసపోకుండా ఉన్న ఊరులోనే ఉపాధి పనులు చేసుకునే వెసులుబాటు కలిగించిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం రోజుకూలి రూ.272 లభించే విధంగా కూలీలు అప్పగించిన పనులను పూర్తి చేయాలన్నారు. హైస్కూల్ పీఎంసీ కమిటీ చైర్మన్ పైల వెంకటరమణ, గ్రామ వైఎస్సార్ సీపీ యూత్ ప్రెసిడెంట్ చింతల శివ అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ సుర్ల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అష్టోత్తరశత మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలి

గండేపల్లి: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17 వరకూ నిర్వహించే అష్టోత్తరశత మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలని ప్రముఖ ఆగమ పండితుడు వీఎస్ఎస్ మూర్తి (పండిట్ శివాచార్య) పిలుపునిచ్చారు. మండలంలోని పలు దేవాలయాల వద్ద సోమవారం అష్టోత్తరశత మహాయజ్ఞం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత మహాలక్ష్మి యజ్ఞాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. యజ్ఞంలో భాగంగా 12న దుర్గామల్లేశ్వరస్వామి, 13న ద్వారాకతిరుమల వేంకటేశ్వరస్వామి, 14న అన్నవరం సత్యనారాయణస్వామి, 15న శ్రీశైల మల్లికార్జునస్వామి, 16న సింహాచలం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 17న మహాపూర్ణాహుతికి ముఖ్యమంత్రి దంపతులు హాజరవుతారని చెప్పారు. ఈ మహాయజ్ఞంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు



ఏవీ నగరంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన ఏడీఏ సుంకర బుల్లిబాబు

తొండంగి: ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ఎటువంటి నిబంధనలు లేకుండా రబీ ధాన్యాన్ని కొలుగోలు చేస్తోందని తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు అన్నారు. మండలంలోని ఏవీ నగరం, రావికంపాడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఎటువంటి నిబంధనలు లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. రైతులు ఆర్బీకేలకు వెళ్లి సమాచారం ఇస్తే సిబ్బంది కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తారన్నారు. తొండంగి మండలంలోని 2386 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారని, దీనిలో 1827 హెక్టార్లు గ్రేడ్ ఏ రకం సాగులో ఉందన్నారు. అకాల వర్షాలకు 33 శాతం పంట దెబ్బతిందన్నారు. ఆర్బీకేల్లో అపరాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం, ఏఈఓ కొప్పన దైవప్రసాద్ తదితరులు ఉన్నారు.